గల్పిక:

# ఏమరింపులో కొత్తపంథా

శ్రీ మధురాంతకం రాజారాం

రాత్రి పదిగంటలైంది నాన్నగారు భోజనంచేసి ప్రక్కింటాయనతో మాట్లాడుతున్నారు నేను గదిలో పడుకొని నిద్రరాక కునికిపాట్లు పడుతున్నాను

‘అయ్యా! ఆకలి!’ అనేకేక వినబడింది

ఆ బిచ్చగాడికి చాలా ఆయాసంగా ఉన్నట్టుంది కానీ అదినిజంగా ఆయాసమో లేక వాడినటనా కౌశలమో నేనూహించుకోలేక పోయాను

‘అందరూ దీపాలుమలిపేసి నిద్రగూడా పోయార్రా పోపో’ అన్నారు నాన్నగారు ఆయన అన్నట్లుగా మా అమ్మగూడా పెరట్లో ఆరుబయట పండుకొని నిద్రపోతున్నది

‘బాబూ! చాలా ఆకలిగాఉంది కనికరించండిదొరా!’ ఈ సారి బిచ్చగాడి కంఠంలో దైన్యం స్పష్టగా కన్పిస్తున్నది

మా నాన్నగారు మెత్తబడ్డట్లున్నారు గాని పొరుగింటాయిన చాలా చిరాకుపడ్డాడు అసలువిషయం ఏమంటే ఆయనకు, బిచ్చగాళ్ళకు జన్మజన్మాంతర విరోధం! తెల్లవారుఝామునే వచ్చితనకు నిద్రాభంగం చేశాడన్న కోపంమీద ఆయన బుడబుక్కలవాణ్ణి ఊరిమొగసాల వరకు తరిమి ఇంకా రెండుమూడు రోజులుగూడా కాలేదు ఈ దఫా ఆయన తనఫాల నేత్రాన్ని ఈ అభాగ్యుడి మీదికి తెరుస్తాడేమోనని నాకు భయంవేసింది

‘ఛీ! పోరా, దొంగవెధవా! అర్ధరాత్రయ్యింది ఇప్పుడువచ్చి అన్నం అడిగితే నీకోసం ఎవరైనా వండిపెట్టుకుని, వేచుకొని కూచొన్నారా? పో పో’

ప్రక్కింటాయన బిచ్చగాణ్ణి ఏకధాటిగా తిట్టడం సాగించాడు వాడు దేశద్రోహం చేస్తున్నాట్ట వీలైతే ఇటువంటి వాళ్ళు దొంగతనాలుగూడా చేస్తారట!

ఈ బిచ్చగాడి హడావుడిలో నాకింక నిద్రరావడం కల్లగాబట్టి, ఎల్లగా గాలైనా వస్తుందని బయటికివచ్చాను బిచ్చగాడు ప్రక్కింటాయన్ను నిర్లక్ష్యంగా చూస్తూ అక్కడే నిలబడి ఉన్నాడు

తిట్టి, తిట్టి నోరునొప్పెట్టిన తర్వాత ప్రక్కింటాయన వీరభద్రావతారంతో బిచ్చగాడి దగ్గరకులంఘించి ‘పోరా, పోరా’ అని అరిచాడు వాడుకదల్లేదు సరిగదా ఇసుమంతకూడా చలించకుండా క్రిందకూలబడి ‘నేనుపోను, పోను’ అని ఊరంతా వినబడేట్టు అరిచాడు

ఈ ధిక్కారాన్ని చూచి నేనాశ్చర్యపడ్డాను మా నాన్నగారికి నోటమాట రాలేదు పొరుగింటాయన మాత్రం రెండింతలుగా విజృంభించి ‘పోవా? పోకేంజేస్తావురా, చవటా?’ అన్నాడు పండ్లుకొరుకుతూ

బిచ్చగాడు తొణకకుండా, శాంతగంభీరమూర్తియైన కథానాయకుని పోజులో ‘నిన్న ఈ ప్రక్కఊర్లోగూడా ఈ మాదిరే అన్నంలేదు పొమ్మన్నారు నేనేంచేశానో తెలుసా? ఊరివాళ్ళంతా హడలిపోయారు న్యాయంగా పట్టెడన్నం వేస్తే వేయండి లేకపోతే ”

పొరుగింటాయనకు పిచ్చెపట్టి పోయేట్టుంది ఏంచేయడానికి తోచక ఆయన అప్రతిభుడై నిలచిపోయాడు నాన్నగారికి ఈ పీడనెట్లాగయిన విదల్చుకోవాలనిపించింది ఆయన ఇంట్లోకివెళ్ళి అమ్మను లేపి కుండలో మిగిలిన పట్టెడన్నాన్ని బిచ్చగాడికి వేయించాడు వాడు నిదానంగా అన్నంతిని, నీళ్ళు తెమ్మని త్రాగి గుమ్మందాటి వెళ్ళిపోయాడు

రెండుక్షణాలు అందరం నిశ్చేష్టులంగా వాణ్ణిచూస్తూ నిలబడిపోయాం తరవాత నేను చరచరా వెళ్ళి వాణ్ణి వెంబడించాను వాడు గ్రామచావిడి దాటుకొని రోడ్డులో కలుసుకొంటున్నాడు నే వాణ్ణి ఒరే అనిపిలిచి ‘ప్రక్క ఊర్లోవాళ్ళు నీకు అన్నంవేయనన్నారుగదా నీవేంచేశావో చెప్పూ’ అన్నాను

వాడు చిన్నగనవ్వి ‘నిజం చెప్పమన్నారా? అపద్దం చెప్పమన్నారా?’ అన్నాడు ‘నిజమేచెప్పరా’ అన్నాను ‘అన్నంవేయమని ఎంతో వేడుకొన్నాను. వాళ్ళు వేయలా నేనేంచేశానో తెలుసునా, బాబూ! ఆకలితో మాడేకడుపును అరచేత్తోపట్టుకొని నిండుపస్తుబడిచచ్చాను’ అని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు బిచ్చగాడు. ★

---

“నాన్నా, నక్షత్రాలెంత దూరంలో ఉన్నాయి?”

“నాకు తెలీదురా”

“చూశావా, నాన్నా? నీ తెలివి తక్కువవల్ల రేపు నేను క్లాసులో దెబ్బలు తినాలి”

* * * *

“నా మంగలికత్తి గొరగదేం?”

“మరీ చోద్యమండీ? మీ గడ్డం పెనసలుకన్న బిరుసా ఏం?”